Chirravuri Research Foundation
for Human and Global Reforms
(A Section 8, Not-for-Profit Research Company)
CRFHGR

# ప్రజా ప్రాతినిధ్యం (ఎన్నికల మానిఫెస్టోలు నియంత్రణ సవరణ) బిల్లు, 2025

## ❖ నేపథ్యం

మన భారతదేశం అభివృద్ధి మరియు పరిణతి చెందుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఒకటి. ప్రస్తుతం ఈ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నెన్నో హామీల ద్వారా ఓటర్లను ఆకర్షిస్తున్నాయి. ఈ హామీల్లోని సాధ్యాసాధ్యాలు, ఆర్థిక విచక్షణ లేమితనం మన సమాజం పట్ల పూర్తిగా అనైతికమైనవి. ఈ బిల్లు ప్రధాన ఉద్దేశాలు –

1. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన ప్రజాస్వామ్య ఎన్నికల సమయంలో ఎన్నికల మానిఫెస్టోల అంశాల నియంత్రణ విధాన రూపకల్పన.
2. ప్రజలందరికీ ఎన్నికల మానిఫెస్టోలను సరళంగా, అర్థమయ్యే భాషల్లో (తగిన వివరణలతో) విడుదల చేసి, ప్రచారం చేయాల్సిన బాధ్యత.
3. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులందరూ విధాన రూపకల్పన యొక్క ఆర్థిక వాస్తవికతలు, బాధ్యతలకు కట్టుబడి ఉండేలా నిర్దేశించడం.
4. 2030 తర్వాత, రాజకీయ పార్టీలు గత ఎన్నికల వాగ్దానాలపై ఎన్నికల మానిఫెస్టో పురోగతి నివేదికను విడుదల చేయాల్సిన అవసరం.
5. ఎన్నికలకు ముందు నగదు పంపిణీ పథకాలను ప్రకటించడాన్ని (లేదా) వాటి అమలును నిషేధించడం మరియు నిబంధనలు ఉల్లంఘించిన వారిని శిక్షించడం.

## ❖ ఎన్నికల మానిఫెస్టో యొక్క నిర్వచనం, నిర్మాణ చట్రం

1. భారత రాజ్యాంగం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయానికి జరిగే ఎన్నికల్లో అయినా ప్రజా మరియు సామాజిక-రాజకీయ చర్చను నడిపించడం కోసం ఏదైనా రాజకీయ పార్టీ (లేదా) పోటీ చేస్తున్న అభ్యర్థి విడుదల చేసే ఏదైనా పత్రం/మెటీరీయల్ ను ఎన్నికల మానిఫెస్టోలుగా నిర్వచించవచ్చు.
2. భారత రాజ్యాంగం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయానికి జరిగే ఎన్నికల్లో అయినా ఒక రాజకీయ పార్టీ (లేదా) పోటీ చేసే అభ్యర్థి తన గెలుపు అనంతరం చేపట్టే పాలన విధానాలు, కార్యక్రమాలు, ప్రణాళికలు, పథకాలు మరియు అజెండాలను ఇందులో పొందుపరచడం జరుగుతుంది.
3. అభివృద్ధి మరియు సంక్షేమానికి సంబంధించిన విధానాలు, పథకాలు & కార్యక్రమాల స్పష్టమైన జాబితా అలాగే వాటికి సంబంధించిన ఖర్చు; ఆర్థిక వనరులు, నిధులకు సంబంధించిన అంచనాలు, కేటాయింపులు; లబ్ధిదారుల ప్రమాణాలను నిర్వచించడం; పథకాల ప్రభావ అంచనా; ఇతర వనరుల కేటాయింపు & వినియోగం, తదితర అంశాలను, ప్రమాణాలను ఈ ముసాయిదా చట్టం నిర్వచిస్తుంది.
4. రాజకీయ పార్టీలు (లేదా) పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల మానిఫెస్టోను విడుదల చేయడం తప్పనిసరి కాదు, అయితే, ఏదైనా ఎన్నికల మానిఫెస్టోను ప్రజలకు విడుదల చేయాల్సిన సందర్భంలో ఆ మానిఫెస్టో ఈ బిల్లులోని సూత్రాలకు కట్టుబడి ఉండాలి.

## ❖ ఈ.సీ.ఐ.లో ఎన్నికల మానిఫెస్టో పానెల్ (ఈ.ఎం.పీ) ఏర్పాటు

1. ఈ.సీ.ఐ. (భారత ఎన్నికల కమిషన్) లో ఐదు మంది ప్రముఖ నిపుణులతో ఎన్నికల మానిఫెస్టో పానెల్ ఏర్పాటు చేయబడుతుంది.
2. ఈ బిల్లు యొక్క సూత్రాలు, అలాగే ఈ బిల్లు ఆధారంగా తయారు చేసే "ఎన్నికల మానిఫెస్టోల

(నియంత్రణ) నియమాలు" కింద జాబితా చేయబడిన నిబంధనలకు అనుగుణంగా ఈ.ఎం.పీ మానిఫెస్టోలను పరిశీలిస్తుంది.

3. ఈ.ఎం.పీ మానిఫెస్టోలను పాక్షికంగా లేదా పూర్తిగా ఆమోదించవచ్చు / తిరస్కరించవచ్చు. ఆమోదించబడిన అన్ని మానిఫెస్టోలను అభ్యర్థి అఫిడవిట్ ప్రచురణ వెబ్ పోర్టల్ మాదిరిగానే ఈ.సీ.ఐ ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌లో 6 నుండి 12 గంటల లోపు ప్రచురించాలి.
4. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మరియు ఇతర ఎన్నికల కమిషనర్లు ఈ.ఎం.పీ యొక్క తొమ్మిది మంది సభ్యులలో ఒకరిని ఈ.ఎం.పీ చైర్‌పర్సన్‌గా నియమించడం జరుగుతుంది.
5. ఈ.ఎం.పీ లోని ఏ సభ్యుడూ అదే ఈ.ఎం.పీ కి తిరిగి నియామకానికి అర్హులు కారు.
6. సభ్యుల కనీస కాలపరిమితి = 2 సంవత్సరాలు; సభ్యుల గరిష్ఠ కాలపరిమితి = 3 సంవత్సరాలు.

### ❖ ఆర్థిక, ఆర్థికేతర మరియు సంక్షేమ ప్రతిపాదనలకు ప్రమాణాలు

1. ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న పథకాలు మరియు విధానాలకు సంబంధించిన నిధులు సమకూర్చే మార్గాల గురించి తప్పనిసరిగా రాజకీయ పార్టీలు మరియు పోటీ చేసే అభ్యర్థులు ప్రస్తావించాలని బిల్లు ప్రతిపాదిస్తుంది.
2. భారత రాజ్యాంగంలోని 280 అధికరణం ప్రకారం గౌరవనీయులైన భారత గణతంత్ర రాష్ట్రపతి గారిచే ఏర్పాటు చేయబడే ఆర్థిక సంఘానికి సంక్షేమ వ్యయంపై జీ.డీ.పీ / జీ.ఎస్.డీ.పీ (జాతీయ / రాష్ట్రాల స్థూల ఉత్పత్తి)లోని నిర్ణీత శాతం మేరకు పరిమితులను విధించే అధికారం మరియు ఆర్థిక సంఘం ద్వారా నిర్ణయించబడిన ఇతర ప్రమాణాల అమలుకు ఈ బిల్లు అధికారం ఇస్తుంది.
3. ఈ పరిమితులను దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మానిఫెస్టోలను ఆర్థిక వాస్తవికతలకు, పరిస్థితులకు అనుగుణంగా రూపకల్పన చేయడానికి వీలుగా జాతీయ మరియు రాష్ట్ర స్థాయిలో ఈ నిర్ణీత పరిమితుల పూర్తి వివరాలను ఈ.సీ.ఐ ప్రచురించాలని బిల్లు ప్రతిపాదిస్తుంది.
4. రాజకీయ పార్టీలు మరియు పోటీ చేసే అభ్యర్థులు ప్రతిపాదిత సంక్షేమ పథకాల కాలక్రమాలను అందించాలని బిల్లు ఆదేశిస్తుంది; సంక్షేమ పథకాల లబ్ధిదారుల తరగతి / సమూహం యొక్క స్పష్టమైన నిర్వచనం; ఉపశమన ప్రణాళికలు; ప్రభావ అంచనా ప్రమాణాలు; సంక్షేమ పథకాల ఆర్థిక నిర్వహణ యొక్క స్వల్పకాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక ప్రభావం అలాగే సంక్షేమ పథకాలకు సంబంధించిన ఖర్చుల విషయంలో ఇతర నియంత్రణ నిబంధనలను పొందుపరచాలని ప్రతిపాదిస్తుంది.

### ❖ ఎన్నికల మానిఫెస్టో అమలు నివేదిక

1. గుర్తింపు దక్కిన అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు మరియు నమోదై (గుర్తింపు లేని) రాజకీయ పార్టీలు గనుక క్రితం జరిగిన ఎన్నికల్లో ఎప్పుడైనా మానిఫెస్టోను విడుదల చేసి, గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్టయితే ఆ ఎన్నికల మానిఫెస్టో అమలు నివేదిక (ఈ.ఎం.పీ.ఆర్)ను పోలింగ్ తేది నుంచి కనీసం 2 నెలల ముందు ప్రచురించి ప్రజలకి అందుబాటులో ఉంచాలి.
2. ఈ.ఎం.పీ.ఆర్ లో రాజకీయ పార్టీలు మరియు వారి అభ్యర్థులకు వర్తించే విధంగా ఏదైనా ఎన్నికల సంబంధిత ఎన్నికల మానిఫెస్టోలలో ప్రతిపాదించిన

విధానాలు, పథకాలు, కార్యక్రమాలు మరియు ప్రణాళికల పనితీరు మరియు ప్రభావ నివేదికలు ఉంటాయి.

3. "ఎన్నికల మానిఫెస్టోల (నియంత్రణ) నియమాలు" ద్వారా ఈ.ఎం.పీ.ఆర్ కు సంబంధించి ఒక ఫార్మాట్ (నమూనా) సూచించబడుతుంది.
4. ఈ నియమాలను ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ రూపకల్పన చేస్తుంది.
5. ఇప్పటికే ఉన్న నిబంధనలు, పద్ధతులకు, సంప్రదాయాలకు అనుగుణంగా, ఈ నియమాల్లో సవరణలు చేపట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ లేదా భారత ఎన్నికల కమిషన్ తగిన విధంగా నోటీసులు ఇచ్చి నిర్ణీత కాలంలో సంబంధిత నిష్ణాతులతో సంప్రదింపులు జరిపి, ప్రజల అభిప్రాయం సేకరించడం, వాటిని అనేక దశల్లో పరిగణించడం, చర్చించడం జరుగుతుంది.
6. పోలింగ్ తేదీకి ఈ.ఎం.పీ.ఆర్ ను 2 నెలల ముందు విడుదల చేయాలి.
7. ఉప ఎన్నికల సమయంలో అర్హత కలిగిన అన్ని రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులు ఈ.ఎం.పీ.ఆర్ విడుదల నుంచి మినహాయింపునకు అర్హులు.

## ❖ ఉల్లంఘన నేరాలు, జరిమానాలు, శిక్షలు

1. సంబంధిత ఈ.ఎం.పీ ఆమోదం లేకుండా ఎన్నికల మానిఫెస్టోను విడుదల చేసినందుకు / ప్రచురించినందుకు జాతీయ / రాష్ట్ర / నమోదై (గుర్తింపు పొందిన) రాజకీయ పార్టీలు మరియు వాటి అభ్యర్థులకు జరిమానా,
   - ₹ 1 కోటి జరిమానా.
   - ఎన్నికల్లో పోటీ చేయకుండా 15 సంవత్సరాల నిషేధం.
2. సంబంధిత ఈ.ఎం.పీ ఆమోదం లేకుండా ఎన్నికల మానిఫెస్టోను విడుదల చేసినందుకు / ప్రచురించినందుకు నమోదై (గుర్తింపు లేని) రాజకీయ పార్టీలు మరియు అన్ని ఇతర అభ్యర్థులకు జరిమానా,
   - ₹ 20 లక్షల జరిమానా.
   - ఎన్నికల్లో పోటీ చేయకుండా 15 సంవత్సరాల నిషేధం.
3. ఈ.ఎం.పీ సభ్యులు విశ్వాస ఉల్లంఘనకు పాల్పడితే,
   - కనీసం 7 సంవత్సరాల కఠిన జైలు శిక్ష.
   - కనీసం ₹ 50 లక్షల జరిమానా.
4. ఎలక్ట్రానిక్ / ప్రింట్ / డిజిటల్ మీడియా ద్వారా ప్రచురణ మరియు ప్రచారానికి సంబంధించిన ఉల్లంఘనల విషయంలో విధించాల్సిన శిక్షలు, జరిమానాలను
   - ప్రస్తుత పత్రికా, మీడియా, విలేఖరుల చట్టాల ఆధారంగా నిర్ణయించబడుతుంది.

## ❖ ఎన్నికల మానిఫెస్టోల ప్రచురణ మరియు ప్రచారం

1. సంబంధిత ఈ.ఎం.పీ ఆమోదం పొందిన 6-12 గంటలలోపు ఈ.సీ.ఐ ఎన్నికల మానిఫెస్టోను నిర్ణీత వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసి ప్రచురించాలి.
2. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచారంలో మరియు అన్ని ప్రచార సాధనల్లో (మెటీరియల్లో) నిర్ణీత ఫార్మాట్లో తాము ప్రతిపాదిస్తున్న విధానాలు, కార్యక్రమాలు మరియు పథకాల ఆర్థిక వ్యయాన్ని చేర్చాలి.
3. ప్రతీ ఎలక్ట్రానిక్ / ప్రింట్ / డిజిటల్ మీడియా ఏజెన్సీలు ప్రతీ రాజకీయ పార్టీ మరియు పోటీ చేసే ప్రతీ అభ్యర్థి ఆలోచనలు, విధానాలు, కార్యక్రమాలు మరియు పథకాల ప్రచార ప్రక్రియలో న్యాయమైన

సమతుల్యాన్ని పాటిస్తూ, సమాన అవకాశాన్ని అందిస్తూ ప్రత్యేకమైన కార్యక్రమాలను నిర్వహించాలి.

## ❖ ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లో చేయాల్సిన సవరణలు

1) పార్ట్ – IVలోని సెక్షన్ 19A తర్వాత, "ఎన్నికల మానిఫెస్టోల ప్యానెల్"కు చట్టపరమైన ఆధారాన్ని అందించే కొత్త సెక్షన్ 19Bని చేర్చడం.

2) రాజకీయ పార్టీలు మరియు పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల మానిఫెస్టోలను సమీక్ష మరియు తదుపరి చర్యల కోసం EMPకి సమర్పించడానికి స్పష్టమైన కాలపరిమితిని అందించడానికి, పార్ట్ – Vలోని సెక్షన్ 30 తర్వాత కొత్త సెక్షన్ 30Aని చేర్చడం.

3) EMP యొక్క ఏర్పాటు, పునర్నిర్మాణం గురించిన సమాచారాన్ని అందించడానికి, పార్ట్ – Vలోని సెక్షన్ 31 తర్వాత కొత్త సెక్షన్ 31Aని చేర్చడం.

4) ఎన్నికల మానిఫెస్టోల పరిశీలనకు సంబంధించిన రుసుమును నిర్ణయించడానికి, సెక్షన్ 34 తర్వాత కొత్త సెక్షన్ 34Aని చేర్చడం.

5) పోలింగ్ తేదీకి ఎనిమిది నెలల ముందు నగదు పంపిణీ పథకాల ప్రకటన లేదా పంపిణీని నిషేధించే కొత్త సెక్షన్ 123Aని, సెక్షన్ 123 తర్వాత చేర్చడం.

6) నిషేధిత కాలంలో నగదు పంపిణీ పథకాలకు సంబంధించిన ఉల్లంఘనలపై జరిమానాలు మరియు చట్టపరమైన చర్యలను నిర్దేశించే కొత్త సెక్షన్ 126Cని, సెక్షన్ 126B తర్వాత చేర్చడం.

CRFHGR